# గోదారమ్మ-18

ఎప్పటిలాగే గోదారమ్మ పిల్లల పని చూస్తుంటే, సీతా, రామచంద్రా కలిసి వంటపని పూర్తి చేసేశారు. వంట చేస్తున్నపుడు రామచంద్ర సీతతో అన్నాడు.

‘‘వాళ్ళిద్దరికీ ఏ కూరలు ఇష్టమో కనుక్కోలేకపోయావా... వాళ్ళు మనకి అతిథులు కదా, వాళ్ళు తినేవీ, ఇష్టమైనవే వండితే సరిపోతుందిగా...!’’

సీత మెల్లగా ‘‘నేను అడిగా. ‘మేం అన్ని రకాల కూరలూ తింటాం! మీరేది పెట్టినా మాకు మహా ప్రసాదమే అనుకోండి’ అన్నాడు శివానంద్, అచ్చం మీలాగే...’’ అంటూ చిన్నగా నవ్వింది.

“అవును సీతా... అన్ని రకాల కూరగాయలూ రుచిగానూ ఉంటాయి, ఆరోగ్యపరంగానూ మంచివే! కాకపోతే కిటుకు అంతా వండేతీరులోనూ, చేసే చేతిలోనూఉంటుంది. నువ్వేది చేసినా బాగా చేస్తావు కనుకనే ‘నాకు నచ్చినది..నచ్చనిది,’ అంటూ ఏమీ లేకుండా అన్ని రకాలూ ఇష్టంగా తినేస్తున్నానంటే కారణం... నీ చేతి మహిమే మరి!’’ అంటూ అతనూ చిన్నగా నవ్వాడు.

సీత అతనివైపు కొంచెం ఆశ్చర్యంగా చూసి కొంటెగా అంది ‘‘మరి... పెద్దమ్మగారు, మన పెళ్ళయ్యాకనే... నావంట మార్పుగా, చాలా రుచిగా ఉంటోందని అన్నారే...!అంటే... నీ చెయ్యి కూడా కలుస్తున్నందువలనే అనే ఉద్దేశ్యమేగా....?’’ సీత ముసిముసి నవ్వులు చిందించింది.

రామచంద్ర ఫక్కున నవ్వాడు.

‘‘అదేం కాదులే, నీకు గుర్తులేదూ... ఓ సారి నీకు నేనే అన్ని పనులు నేర్పించానని అంటే ఏం అన్నారో...? నువ్వు ముందు నుండీ అన్నీ చక్కగా చేసేదానివని కితాబిచ్చారుగా...!’’

‘‘సరేలే... బావుంది. వేరేవాళ్ళ అవసరం లేకుండా నిన్ను నేను... నువ్వు నన్నూ మెచ్చుకుంటూ మాట్లాడుకుంటున్నాం...! అవునా...!’’

అతను సీత మెడమీద తన భుజం ఆనించి సరదాగా అన్నాడు ‘‘ఏం... మనం మనం, మెచ్చుకోవటంలో... తప్పేం ఉందీ...? ఆనందకర సంసారానికి ఇలాంటి ప్రశంసలు ఎంతో అవసరం కూడానూ....!’’

‘‘అబ్బో...!’’ అంటూ సీత కళ్ళెగరేసింది! ‘‘తమరిప్పుడు సంసారాలకి సూత్రాలు కూడా చెబుతారు కాబోలు...! ఒకప్పుడు తమరు పెళ్ళేచేసుకోనని అన్నారటా...?’’ అంటూ ప్రశ్నించింది.

‘‘అవును... అది ఒకప్పటి మాట... కుముదను నేనే పెంచి పెద్ద చేయాలనే బాధ్యత ఉందని తెలియగానే చాలా సంబంధాలు వెనక్కిపోవటంతో ఇక పెళ్ళి ప్రసక్తే వద్దనుకున్నా. కానీ నిన్ను చూశాక... నీ గురించి విన్నాక, ఇలాంటి అందాల, సుగుణాల రాశి ఎవరికి భార్యగా లభిస్తుందో... వాళ్ళది ఎంత అదృష్టమోకదా... అనుకునేవాడిని! అయితే అనుకోకుండా ఆ అదృష్టం నన్నే వరిస్తుందని మాత్రం ఊహించలేదు! నా ఆశ నిజమౌతోందని తెలిసాక, అబ్బ.... ఆ ఆనందాన్ని మాటలో చెప్పటం నా వల్లకాదు సుమా...!’’ అతని కళ్ళు పారవశ్యంతో అరమోడ్పులయ్యాయి!

‘‘సరే... సరే... ఇపుడు నేనూ నీ జత నాకు దొరికినందుకు నా అదృష్టం గురించి చెప్పాలి కాబోలు...!’’ అంటూ నవ్వి ‘‘అలా పరస్పర పొగడ్తలు అవసరమని అంటున్నావుగా’’ అంది.

అతను సీతవైపు ఆశ్చర్యంగా చూసాడు.

‘‘పొగడ్తలు అంటున్నావేమిటి సీతా... నేను నిజాలేగా చెప్పానూ...?’’

అతని ప్రశ్నకి సీత తలవంచి ‘‘నిజాలు అయినా కాకపోయినా గానీ, నీ నోటి వెంట ఇలాంటి మాటలు వినటం నాకూ చాలా బావుంది సుమా...!’’ అంటూ అతనివైపు నవ్వు మొహంతో ఓరగా చూసింది.

అలా ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ సరదాగా వంట ముగించేశారు.

శివానందు వచ్చి ‘‘ఇలా ఖాళీగా కూర్చోవటం ఏం బాగాలేదండీ... మాకూ ఏదైనా పని పురమాయించండి...!’’ అనడిగాడు సీతని. సీత నవ్వింది.

‘‘ఇద్దరూ సెలవులు పెట్టారుగా... చక్కగా సరదా కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయండి...! అంతకన్నా మీరు చేసే పనులేవీ లేవులే బాబూ...!’’ అంది.

సీత బడికీ, రామచంద్ర ఆఫీసుకీ వెళ్ళిపోయాక, శివానందూ, ఆ అమ్మాయీ ఇద్దరూ కలిసి సీతా వాళ్ళింటి పక్కనున్న కాస్త ఖాళీ స్థలాన్నీ శుభ్రంగా గడ్డీ అవీ తీసి బాగుచేశారు.

‘‘ఎందుకమ్మాయ్... లేనిపోని పని మీకు....! ఎంత తవ్విపోసినా నాలుగురోజుల్లో మళ్ళీ పిచ్చిమొక్కలు, గడ్డీ లేస్తాయి...!’’అంది గోదారమ్మ.

ఆ అమ్మాయి గోదారమ్మ దగ్గరకు వచ్చి ‘‘నా పేరు కమలండీ...! నా దగ్గర కొన్ని కూరగాయల విత్తనాలు ఉన్నాయండీ... అవి పెడదామనే అలా శుభ్రం చేశాం...!’’ అని చెప్పింది.

ఆవిడ కమలవైపు ఆశ్చర్యంగా చూసింది.

చెప్పినట్టే, ఇద్దరూ కలిసి మట్టిని బాగా తవ్వి మడులుగా తయారుచేసి, విత్తనాలు పెట్టి... అపుడు శుభ్రంగా చేతులు కడుక్కున్నారు.

మధ్యాహ్నం ముగ్గురూ ఒకచోట కూర్చుని భోజనాలు కానిచ్చారు. గోదారమ్మ ముఖంలో సంతృప్తి, సంతోషం కనిపించాయి.

ఆ సాయంత్రం సీతకి ఆవిడ ఎంతో ఆనందంగా వాళ్ళిద్దరి పని గురించీ వివరించి చెప్పి ‘‘కష్టపడే తత్వం ఉన్న వాళ్ళు కాబట్టి తప్పకుండా వృద్ధిలోకి వస్తారు!’’ అంటూ మెచ్చుకుంది. సీతకూడా ‘అవునా’ అన్నట్లుగా ఆనందంగా ఆవిడ చెప్పిన కబుర్లన్నీ విని సంతోషించింది. రోజూ సీత, రామచంద్ర ఇద్దరూ వాళ్ళ పనులమీద బయటకు వెళ్ళాక శివానందూ, కమలా కూడా ఇంట్లో పనులు కల్పించుకుని పూర్తిచేసాక, ఇల్లు వెతుక్కోవటానికి వెళ్ళేవాళ్ళు.

ఆరోజు...

కమల నవ్వు మొహంతో గోదారమ్మతో సంతోషంగా చెప్పింది.

‘‘ఇక్కడికి బాగా దగ్గర్లోనే అద్దెకి ఇల్లు దొరికిందమ్మా. చిన్నదే అయినా పొందిగ్గా ఉంది! ఈ ఇంటికి దగ్గర్లోనే దొరకటం మాకు చాలా బావుందమ్మా. రామచంద్రగారు, సీతగారు ఇద్దరూ ఉద్యోగస్థులే కాబట్టి మొక్కల పని చూడలేరని అనుకుంటున్నాం. ఇపుడా భయం తీరిపోయింది. మేమిద్దరం పనులనుండి వచ్చేసాక, మొక్కలకు నీళ్ళు పోయటం లాంటి పనులన్నీ వచ్చి చూస్తాం. మాకు పిల్లల పనులుకూడా లేవు. కాబట్టి కొంచెం ఖాళీగానే ఉంటాం కదండీ...!’’

గోదారమ్మ కూడా ఆనందంగా అన్నది..‘‘అయితే ఇల్లుకూడా చూసుకున్నారు. ఇక పెళ్ళి తంతు కాస్తా పూర్తయితే, కాపురం పెట్టేస్తారన్నమాట...!’’

కమల సిగ్గుగా తలవంచుకుంది...శివానందు సంతోషంగా నవ్వాడు

తరువాత మెల్లగా చెప్పుకొచ్చాడు ‘‘మీ పేరువలనే ఇల్లు కాదనకుండా ఇచ్చారండీ. రామచంద్ర గారు కూడా మొన్న అడిగారు. అపుడు ఆలోచించి తరువాత చెబుతామని అన్నారట. ఈ రోజు మేమూ వెళ్ళి అడిగేసరికి వాళ్ళేమన్నారో తెలుసాండీ ‘గోదారమ్మగారు, రామచంద్రగారూ వాళ్ళు మీ వెనక ఉన్నారంటే... మీకు ఇల్లు ఇవ్వటానికి మాకేం భయం లేదూ’ అని! ఇదంతా మీ వలనే జరిగింది! మీకు దగ్గర్లో ఉండగలుగుతున్నామని మాకూ చాలా సంతోషంగా వుందండీ...ఇక కూరగాయల సంగతి మాకొదిలేయండి. అన్నీ మేమే పండిస్తాం. మనం కూరగాయలనేవి ఏవో కొన్ని తప్ప కొనాల్సిన అవసరమే ఉండదు! ఖర్చు గురించి కాదుగానీ, ఎలాగైనా మనం మన పెరట్లో పెంచిన వాటి రుచీ, ప్రత్యేకతే వేరుగా ఉంటుంది కదండీ...?’’

అతని మాటల్ని అంగీకరిస్తున్నట్లుగా గోదారమ్మ సంతోషంగా ‘‘అవునవును...’’ అంటూ తలవూపింది.

* * *

అనుకోకుండా ఆ రోజే... కమల తల్లిదండ్రులిద్దరూ వచ్చారు. పక్కవూరే కాబట్టి పిల్లల ఆచూకీ తొందరగానే తెలిసిందన్నారు. ‘చంపుతాం, చస్తాం’ అంటూ రంకెలు వేసారు! ఇక కమల తల్లి కూతురిని కులం దాటి ప్రేమించి, పరువు తీసినందుకు తిట్టిపోసింది. తర్వాత ఆయాసం వచ్చి కొంతసేపు ఆగింది.

కమల వచ్చి తల్లికి, తండ్రికి చేతులు జోడించి... చెప్పింది ‘‘నేను చేసింది మీకు తప్పనిపిస్తే.... నన్ను మాత్రమే శిక్షించండి. నన్ను చేపట్టిన వాడికి, ఆశ్రయ మిచ్చిన వాళ్ళకి మాత్రం హాని తల పెట్టకండని వేడుకుంటున్నాను! నన్ను ప్రేమగా పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులుగా మీకు మాత్రం నన్ను నిలదీసే హక్కు ఉంది. అంతే తప్ప.. నన్ను మీలాగే ప్రేమగా చూసుకుంటానని మాట ఇచ్చి, నాచేయి పట్టుకోవటానికి సిద్ధపడిన అతన్నిగానీ, మాకు ఆశ్రయమిచ్చి రక్షణగా నిలిచిన రామచంద్రగారి కుటుంబానికి గానీ హాని తలపెట్టే హక్కు, అధికారం మీకు లేవని చెప్పదలచుకున్నాను. ఇంతకన్నా నేను మిమ్మల్ని ఏమీ కోరుకోవట్లేదు.’’ చేతులు జోడించి, చకాచకా చెప్పి లోపలకు వెళ్ళిపోయింది కమల.

కమల తల్లిదండ్రులిద్దరూ నోటమాట రానట్లుగా ఓ క్షణం నిశ్శబ్దంగా ఉండిపోయారు. అప్పుడు గోదారమ్మ కల్పించుకుని వాళ్ళతో మాటలు కలుపుతూ కమల తల్లి వైపు చూస్తూ ‘‘కులం అంటే ఏమిటమ్మా...?’’ అనడిగేసరికి ఆవిడ కొంచెం తెల్లమొహం వేసి ‘‘కులం అంటే....’’ తనలో తాను గొణుకుకుంటున్నట్లుగా పైకే అని, భర్తవేపు చూపు తిప్పింది.

ఆయనా నీళ్ళు నమలుతున్నట్లుగా ‘‘కులం అంటే కులమే గదా.... అందరికీ ఉంటుంది కదా...!’’ అన్నాడు.

అపుడు గోదారమ్మ వాళ్ళ వైపుచూస్తూ అంది ‘‘నాకు తెలిసినంతవరకూ చెబుతానమ్మా... కులం అనేది మనం చేసే వృత్తి పనులు ఆధారంగా మనకు పెద్దవాళ్ళు ఏర్పరిచినది. ఈ కాలానికి అది అంత అవసరమా అని మనం ఆలోచించుకోవాలి. ఒక కులానికి చెందిన వాళ్ళకి ఆచారాలు, సాంప్రదాయాలూ, అలవాట్లు అన్నీ ఒకే రకంగా ఉంటాయానే ఉద్దేశ్యంతో మనపెద్దవాళ్ళు తమ కులానికే చెందిన సంబంధాలను పిల్లలకు చూసి చేస్తారు. దాని వలన వేర్వేరు ప్రాంతాలలో పెరిగిన పిల్లలకు పెళ్ళి తర్వాత ఒకే చోట కలిసివుంటున్నప్పుడు, ఎటువంటి ఒడిదుడుకులూ ఏర్పడవనే ఉద్దేశ్యంతో ఏర్పడిన ఆచారం ఇది. పెళ్ళికి అన్నిటికంటె... పిల్లలిద్దరికీ ఒకరిపై ఒకరికి ఏర్పడేఇష్టమే ముఖ్యం. అలా ఇష్టపడి.... ఎవరైనా పెళ్ళి చేసుకోవాలనే ఆసక్తి కనబరిస్తే... మనం వాళ్ళ తల్లిదండ్రులుగా అంగీకరించి ఆశీర్వదించటమే చేయగలిగాలి! అబ్బాయి ఎలాంటివాడూ, మన అమ్మాయిని ప్రేమగా చూసుకుంటాడా, ప్రేమతో పాటూ అతనికి స్థోమత వుందా, లేదా... ఇలాంటి వివరాలన్నీ వాకబు చేసి, మంచీ, చెడూ.. విడమరచి చెప్పటమే, మనం చేయగలం! ఎదిగిన పిల్లలకు జీవితంపట్ల అవగాహనా, విచక్షణా జ్ఞానం ఉంటుంది గదా... అందుకని పెళ్ళి నిర్ణయం వాళ్ళ అభిప్రాయాలకు విలువ ఇచ్చి చేయటమే మంచి పద్ధతి అని నా అభిప్రాయం! అంతేగానీ, పుట్టుకతో వచ్చే కులానికి ఎక్కువ విలువ ఇచ్చి పరువుపోతుందనుకోవటం మూర్ఖత్వమేగా. ‘చంపటం, చావటం’ లాంటి పిచ్చి పనులు చేస్తేనే పురువు పోతుందిగానీ ఎలా పెరుగుతుందో నాకర్థం కాదు.

మీరు చెప్పినట్టుగానే వాళ్ళిద్దరూ రెండేళ్ళు, సంపాదనలోకి వచ్చేవరకూ మీ మాటకే విలువిచ్చి ఆగారు కదా...వీళ్ళది ప్రేమ కాకుండా వ్యామోహం అయి ఉంటే, అన్నేళ్ళు ఒకరికోసం ఒకరు వేచి చూడలేరు.

కానీ ఆ తర్వాత కూడా మీరు మారకపోయేసరికి, అతనిపై ప్రేమను చంపుకోలేక, మిమ్మల్ని వదలలేక , మీరు అభ్యంతరం చెప్పినపుడు మొదట మీ అమ్మాయి...చచ్చిపోదామని అనుకుందట. రామచంద్ర వాళ్ళ పెళ్ళి చేస్తానని భరోసా ఇచ్చినపుడు... మీ కూతురు ఆత్మహత్య ప్రసక్తి వదిలేసిందట.

మీకిష్టం లేకపోతే, మీరు పెళ్ళి చేయకండి. అంతే... వాళ్ళ మానాన వాళ్ళ బ్రతుకును బ్రతకనివ్వండి గానీ, చంపే ఉద్దేశ్యం పెట్టుకోకండి. మీ అమ్మాయి అర్థం పర్థంలేని పరువనేమాటకోసమో లేక ప్రేమకోసమో ప్రాణాలు తీసుకుంటే... లేకపోతే..ఆ అబ్బాయో, మీ అమ్మాయో, మీ చేతుల్లో జీవితం పోగొట్టుకుంటే, మీకొచ్చేలాభం ఏమైనా ఉందా? దానికన్నామీకు అమ్మాయే లేదనుకుంటే సరిపోతుందిగా...?’’

ఆ ప్రశ్నకు కమల తల్లి మళ్ళీ రాగాలు తీసింది ‘‘అమ్మో... అలా అనకండి... ఆ మాట వింటేనే తట్టుకోలేకపోతున్నాను?’’ అంది కళ్ళు, ముక్కు తుడుచుకుంటూ.

గోదారమ్మ చిరునవ్వుతో చెప్పింది ‘‘చూశారా... మీ అమ్మాయి మరణం గురించి మాట్లాడితేనే కన్నతల్లిగా మీరు తట్టుకోలేకపోతున్నారు. ఆ అబ్బాయినీ చంపితే వచ్చే లాభం ఏమిటీ... జైలు కెళ్ళికూర్చోవటం తప్ప...? వాళ్ళ తల్లిదండ్రులకీ ఇలాంటి శోకమే కదా కలుగుతుందీ...?”

ఆమె ప్రశ్నలకు జవాబు చెప్పలేనివాళ్ళలా వాళ్ళు కాసేపు ఆలోచనలో పడ్డారు. చివరకు ఇద్దరూ లేచి నిలబడ్డారు. ''ఏమైనా గానీ, మా చేతులతో మాత్రం ఈ పెళ్ళి చేయలేం... ఏదోలా వాళ్ళనే చేసుకోమనండి'' అంటూ వెళ్ళిపోయారు. దాంతో గోదారమ్మకీ, శివానందు, కమలకీ కొంచెం తేలికగా అనిపించింది. జరిగినదంతా విని సీతా, రామచంద్రలు కూడా కొంచెం నిశ్చింత పడ్డారు. ఆ మరునాడు శివానందు తల్లిదండ్రులూ వచ్చారు. వాళ్ళదీ అదే ధోరణి. గోదారమ్మ వాళ్ళకీ అదే మాటలు చెప్పింది. వాళ్ళు మెత్తబడి... పిల్లల ఇష్టానికి వాళ్ళని ఒదిలెయ్యటమే మంచిదనే అభిప్రాయానికి వచ్చారు.

దాంతో ఇక వాళ్ళ పెళ్ళి తామే జరపటమే మంచిది, అనే అభిప్రాయానికి వచ్చి, ఏర్పాట్లు గురించి మాట్లాడుకున్నారు.

పెద్దగా ఆర్భాటాలేమీ లేకుండా సీతా-రామచంద్రల పెళ్ళి మాదిరిగానే వీలైనంత తక్కువ ఖర్చుతో జరపటమే మంచిదని అనుకున్నారు.

తమ వాళ్ళెవరూ లేకుండా పెళ్ళి చేసుకుంటున్నందుకు ఇద్దరి ముఖాలూ కొంచెం చిన్నబోయాయి.

''ఇష్టపడిన వాళ్ళ చేయి అందుకుంటున్నందుకు సంతోషించండి. మీ తల్లిదండ్రులు తమ బెట్టు, పట్టుదలలు వదిలేసి, మీ దగ్గరకు వచ్చే రోజు తప్పక వస్తుంది. దానికోసం ఎదురుచూడటమే మీరు చేయాల్సింది'' అంటూ గోదారమ్మ వాళ్ళని అనునయించింది.

ఆ తర్వాత సీతతో గోదారమ్మ చెప్పింది. ''వీళ్ళిద్దరినీ వెంటబెట్టుకు వచ్చిన రోజు నేను రామచంద్రని అడిగాను 'ఎలాంటి కష్టనిష్ఠూరాలు వస్తాయో ఆలోచించావా' అని. దానికేమన్నాడో తెలుసా...? 'ఏముందండీ...మహా అయితే, ఈ పెళ్ళికి నేనే కారకుడినని నా ప్రాణాలు తీస్తారేమో... అంతేకదా...అంతకన్నా ఇంకేం చేయగలరు? ప్రాణాలు ఎప్పటికైనా పోయేవే... పుట్టినపుడే ఈ విషయం రూఢి అవుతుంది! ఒక వేళ ముందుగా... ఈ సందర్భంగా ప్రాణాలు పోగొట్టుకుంటే... నా జీవితానికే ఓ విలువ ఏర్పడినట్లే కదండీ!' అన్నాడు సీతా... రామచంద్ర మాటలతో అతని మనసెంత గొప్పదో నాకర్థమైంది! శివానందు, కమల తల్లిదండ్రులని చూస్తే... వాళ్ళంతటి ఘాతుకానికి తల పెట్టే వాళ్ళలా లేనేలేరు! ఏం చెబితే, అదే విన్నారు, నమ్మారు! అందుకే ఈ కథ సుఖాంతమైందనిపిస్తోంది! నాకూ ఇపుడు చాలా నిశ్చింతగా ఉంది!''

ఈ మాటలతో సీత కొంచెం కలవర పడినట్లుగా అనిపించింది.